# సువర్ణమేఖల

జనమంచి కామేశ్వరరావుగారు

నేనూ మా రాజీ ఎప్పుడూ యిల్లాగే వున్నామా! అనిపిస్తోంది. గతించిన విషకాలం, రాబోవు నిషాకాలం, మాతో నిలిచివున్న ఈ నిమేషకాలంతో మేళవించి చుక్కలకూ వాళ్ల రాజుకుకూడా ఆనందసందేశాల నంపుతున్నాయి.

ఎన్ని నిశలో! గతించిన నిద్ర మొన్న మొన్నటిదాకా ఆవలించి కలవరిస్తూనే వుంది.

ఎన్ని నిశలో! విడచిన వేడినిట్టూర్పులూ, కళ్లల్లో మెరుగుతూండే దుస్స్వప్నాలూ కకుబంతాల కనల్చి, నరసవృష్టిని దిగజారి విశ్వాన్ని వివశం చేశాయి.

విధివిరామం లేక జపించిన మా రాజి రాగరేఖ మొన్ననే నాదబ్రహ్మని ఓంకారంలో కలసి వినిపించింది.

నేను ప్రేమబాధల పొగిలి, సోలి, త్రిభంగపదవి కూర్చుకొని ఆశాప్రతీక్షలో కుంచుకొని పోతూంటే, ఆమె మహారాజ్ఞియై చిరునవ్వ చిలుకు తొలకరి మబ్బులా దైవతపథాలనుండి నా కెదురుగా నవతరించి తన హృదయమలయ మారుతాల ప్రసరించేది. అంత నాహృదయం మిసిమించి కుసుమించి పరిమళించేది.

ఎవరో నింగినీలాల చాందినీ చీల్చికొని వచ్చి నిశ్శబ్దరజనీజీమూతరాగప్రశస్తి నాలపింపక గుసగుసలుపోతూ మమ్మే తిలకించేవారు. శశిరాజును కళ్లుమూయ మని శాసించేవారు. వెన్నెలచిన్నిపువ్వులు మామీద జలజల రాల్చేవారు. పాపం! ఆలోకులకు నేనూ మా రాజీ అంటేఎంతో యిష్టం. మాది అతిలోక సాంద్రతృష్ణ యని వారికి తెలుసు.

నా రాజి ఆమె సుధాపునీతనిశితదృక్కులతో నాలౌకికభావాల నన్నిటినీ దహనం చేసింది. తన దరహాసవల్లిక నా హృదయంలో నాటి, అంటుకట్టి విరులతోట పెంచింది. నా చూపు మేరదూరంలో వుండి మా యిద్దరి మధ్యనూ విశ్వాన్ని యిమిడ్చింది. నాకు మా రాజికి విశ్వమే విడని కౌగిలైంది.

నేను రాజికౌగిల్లో విశ్వ ముంటూంటే వెర్రిగా పొగిలి కనలిపోయేవాణ్ణి. నన్ను విశ్వంలో వాణ్ణిగా చూసేది కాదు. నన్ను తన కౌగిల్లోనికి చొరనిచ్చేది కాదు. నన్ను విశ్వంలోనుంచి వేరుచేసేది.

ఎందుకిల్లా చేస్తావంటే?

విశ్వాన్ని తన అనంత బాహువులూ సాచి కౌగిలించుకుంటూంటే నేను పైనుంచి చూడాలట! చూసి మా రాజి శక్తిసంపద లెంత! అని మెచ్చుకోవాలట!

నేను విశ్వాన్ని కౌగిలిస్తూంటే తనేమో దూరదూరాలకు తప్పుకొంటూ తారిపోయి విశ్వాన్ని నాకౌగిల్లో యిమిడాక నాయెదుట నిలిచి పకపకా నవ్వుతుంది.

ఏమి నవ్వుతావు రాజీ! అంటే విశ్వాన్ని కౌగిలించుకుంటూన్నా నేను ద్విబాహినేయనిట... ఆ రేయి విశ్వమంతా అవశమై నిశ్చలసుషుప్తిలో మునిగిపోయింది. నేనంత చేతులు దొప్ప గట్టి నాముఖానికి దోయిలుంచుకొని నాలో కూడ అనంతబాహువు లెప్పుడు విరిసికొని పోతాయి రాజీ! అని అడిగాను.

“ఎప్పుడు నీవు నన్ను చూడగా ప్రేమపొంగలు చిమ్మకుండా, త్రిభంగపదవికూర్పకుండా అవలోకితేశ్వరస్వామిలా నిల్చుంటావో అప్పుడు” అని సన్నగా నాసందేహానికి సందేశం పంపింది రాజి.

అయ్యో! నేనింకా అల్పమర్త్యుడనే! అని నేను వెరగుతో నైస్పృహ్యం పొందాను.

అంతలో విశ్వరూపసందర్శనం నాదృష్టినుండి మాసిపోయింది. చీకటే క్రమ్మింది నన్ను మా రాజినీకూడ.

ఆమె కొంతసేపు నభోలక్ష్మి నీలిచెరగులో దాగుంది. తరువాత వాలుజడనల్లకుంచె చేత పట్టుకొని అల్లా అల్లా తరలిపోయింది—స్వర్గపేటిలో దాచుకున్న కిరీటంమీద చిత్రితమైన నారూపం చెరిపెయ్యాలని—

ఒకసారి తారామోహనమూర్తి నన్ను ఎర్రగా చూచి, రెండు కరుణాశ్రుకణాలురాల్చి ‘వీడి బ్రతుకింతే!’ అని తన నీలిసౌధంలోని మధుమందిరం చేరుకున్నాడు. తారలన్నీ రాజుగారి అరుణదృక్కులు పోల్చుకొనలేక కోపాతిరేకముచేతనే అనుకొని గబగబా భువికి రాలిపోయినాయి. నేనంతే అల్లా నిల్చిపోయినాను.

చీకట్లు క్రమ్మినై. నారాజి మళ్లీ నావైపుకే యాత్రసాగించింది. వెక్కి వెక్కి పసిగోలగా ఏడుస్తూన్న నన్ను చూసింది. ప్రసన్నత దొరకించుకొన్న హృదయమవడంచే నన్ను కామించింది. నన్ను చేరి నవ్వుతూ తన కరాలింగనాల్లో భూర్భువర్లోకదృశ్యాలు చూపింది. జలజల స్రవిస్తూన్న నాసెలజాలు తనలోనికి పారించుకుంది. దివిజగంగ తనలో యిముడ్చుకున్నట్టే నవ్వుతెరగల చిమ్మింది. * * * * ఇంతలో ప్రళయం క్రమ్మినట్టైంది. వియత్తలపు నీలిపరుపుటాకాలన్నీ తెగిపోయినై. ఘనరాసులన్నీ ప్రళయఝంఝానిలంలో కలసి ఆశాంతాల కెగిరిపోయినై. నభోలక్ష్మి కార్మొయిలు పెదవులవిప్పి, దంష్ట్రాగ్ని చిమ్మి ప్రళయభీకరంగా మృత్యుకేళి సలిపింది.

ఒక మెరపు సువర్ణమేఖలై మమ్ము ఆవరించింది. మరొకటి మమ్ము స్వర్గపుద్యానాల్లో దింపింది.

ఆ సువర్ణమేఖల మమ్మింకా కదిస్తూనే వుంటుంది. మేము చేతులుపట్టుకొని “ఒప్పుల కుప్పా! ఒయ్యారిభామా” ఆడుతూ తాండవనృత్యకేళి చేస్తాం మామధ్యనే విశ్వం ఆడుతూ పాడుతూ, హాయిగా తేలుతూంటుంది. అప్పుడు మేఖల కరగి చిన్న చిన్న గీతులై మాకు ప్రేమసంగీతం వినిపిస్తుంది.

విశ్వం అవశమై వుంటే మేఖల మమ్ము కుదించుకుంటుంది. మేమంత అనంతంలోనికి సాగిపోయి కేరుకుంటాం. మళ్లీ విశ్వం మేల్కొనగానే దాన్ని మా విడని కౌగల్లో యిముడ్చుకొని శ్రావ్యగీతుల లాలించి తేలిస్తాం. ఇదే మా ఎడలేని ఆట; తేటిపాట.